సాక్షి నిజామాబాద్

గురువారం । 26 । జూన్ । 2025



మాదకద్రవ్యాల నియంత్రణే..
మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాల నియంత్రణే లక్ష్యమని కలెక్టర్ టీ వినయ్ కృష్ణారెడ్డి, సీపీ సాయిచైతన్య పేర్కొన్నారు.
- 8లో ▸



తీవ్ర జాప్యం..
రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తు చేసుకున్న యువత రుణాల కోసం ఎదురుచూస్తోంది.
- 8లో ▸



వాతావరణం
ఉదయం చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం మేఘావృతం అవుతుంది. అక్కడక్కడ గాలులతో కూడిన వర్షం కురిసే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

రైతుల ఖాతాలలో రూ.316.93 కోట్లు

నిజామాబాద్‌అర్బన్: రైతు భరోసా పథకం కింద జిల్లాలోని 2,72,822 మంది రైతుల ఖాతాలలో ఇప్పటి వరకు రూ. 316.93 కోట్ల నిధులు జమ అయ్యాయని కలెక్టర్ టీ వినయ్ కృష్ణారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వానాకాలం సీజన్‌కు సంబంధించిన పంట పెట్టుబడి సాయం కింద ప్రభుత్వం జిల్లాలో మొత్తం 2,98,510 మంది రైతులకు రూ. 326.07 కోట్లను నేరుగా వారి బ్యాంకు ఖాతాలలో జమ చేస్తుందని పేర్కొన్నారు.

నేడు డీహెచ్ రవీందర్ నాయక్ రాక

నిజామాబాద్‌నాగారం: రాష్ట్ర వైద్యారోగ్యశాఖ డైరెక్టర్ ఆఫ్ హెల్త్(డీహెచ్) డాక్టర్ రవీందర్‌నాయక్ జిల్లాకు రానున్నారు. గురువారం కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డితో కలిసి జీజీహెచ్, మెడికల్ కళాశాలలను పరిశీలించనున్నారు. నేషనల్ మెడికల్ కౌన్సిల్ (ఎన్ఎంసీ) గైడ్‌లైన్స్ ప్రకారం నియమ నిబంధనలు, లోటు పాట్లను తనిఖీ చేయనున్నారు. మెడికల్ కళాశాల, జీజీహెచ్‌లో ఉన్న సమస్యలు, పరిష్కారాలపై క్షుణ్ణంగా పరిశీలించనున్నారు. మానిటరింగ్ కమిటీ ఆధ్వర్యంలో తనిఖీ ఉంటుందని, కమిటీకి చైర్మన్‌గా డీహెచ్, సభ్యులుగా కలెక్టర్, కళాశాల ప్రిన్సిపల్, టీఎస్ఎంఐడీసీ ఈఈలు ఉన్నారు. మెడికల్ కాలేజీలో ఖాళీగా ఉన్న పోస్టులపై కళాశాల ప్రిన్సిపల్, అధికారులు మానిటరింగ్ కమిటీ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిసింది.

స్పోర్ట్స్ స్కూల్ ప్రవేశాలకు ఎంపిక పోటీలు



నిజామాబాద్‌నాగారం: జిల్లా కేంద్రంలోని నాగారంలోగల రాజారాం స్టేడియంలో బుధవారం స్పోర్ట్స్ స్కూల్ ప్రవేశాలకు ఎంపిక పోటీలు నిర్వహించారు. ఆన్‌లైన్‌లో 4వ తరగతి విద్యార్థులు సుమారు 30 మంది దరఖాస్తు చేసుకోగా, పోటీలకు 20 మంది మాత్రమే హాజరయ్యారు. జిల్లా యువజన క్రీడల అధికారి ముత్తెన్న ఆధ్వర్యంలో పిల్లలకు ఎత్తు, బరువు, కొలతలతోపాటు రన్నింగ్, లాంగ్‌జంప్, హైజంప్, త్రోబాల్ తదితర విభాగాల్లో పోటీలు నిర్వహించారు. ప్రతిభ చూపిన వారిని రాష్ట్రస్థాయికి గురువారం ఎంపిక చేసి పంపిస్తామని ముత్తెన్న తెలిపారు. పీడీలు వెంకట్, గోపిరెడ్డి, రమేశ్, స్వామి, రాజేశ్వర్, సిబ్బంది పాల్గొన్నారు.

■ ఈ నెల 20న ధర్పల్లి మండలం కోటాల్‌పల్లి అటవీ ప్రాంతంలో పోడు భూములు దున్నుతున్నారనే సమాచారంతో సెక్షన్ ఆఫీసర్, బీట్ ఆఫీసర్లు కలిసి ఘటనా స్థలానికి వెళ్లారు. భూమిని దున్నుతున్న వ్యక్తులు ప్రణాళిక ప్రకారం వారి వెంట తెచ్చుకున్న పొడికారాన్ని అధికారుల కళ్లలో చల్లి దాడి చేశారు. ట్రాక్టర్‌తోపాటు పరారయ్యారు. దాడి చేసిన వారిపై పోలీస్ స్టేషన్‌లో కేసు పెట్టగా పోలీసులు 11 మందిని పట్టుకున్నారు. దున్నిన ట్రాక్టర్‌ను సైతం సీజ్ చేశారు.

■ వర్ని రేంజ్ పరిధిలో పోడు భూములు దున్నడానికి ఆయా గ్రామాలు, తండాల వ్యక్తులు ప్రయత్నాలు చేస్తున్నారు. జలాల్‌పూర్ అటవీ ప్రాంతంలో పోడును దున్నాలని చూసిన సిద్ధాపూర్ గ్రామస్తులను ఇటీవల వర్ని రేంజ్ అధికారి గంగాధర్ పిలిపించి మాట్లాడారు. భూముల్లేని మేము పోడు భూములను సాగు చేస్తామని అధికారితో వాదించారు. దాడి చేస్తారనే భయంతో ఎఫ్ఆర్వో తన వెంట సిబ్బందిని తీసుకెళ్లాడు.

■ సౌత్ రేంజ్ పరిధిలో అటవీ భూముల ఆక్రమణలు అడ్డుకునేందుకు అన్ని గ్రామ పంచాయతీలు, బహిరంగ ప్రదేశాల్లో నోటీసులు అతికించి హెచ్చరికలు జారీ చేశారు. పోడును దున్నుతున్న ట్రాక్టర్లను సీజ్ చేశారు. మోపాల్ మండలంలోని వివిధ గ్రామాలు, తండాలకు చెందిన 53 మందిపై పీడీ యాక్టు నమోదు చేయాలని ఎఫ్ఆర్వో రాధిక జిల్లా కలెక్టర్‌కు ప్రతిపాదించారు. ఒకటి, రెండు సార్లు చెప్పినా మార్పు రాకపోగా పోడును మళ్లీ దున్నినందుకు వారిపై కఠిన చర్యలకు సిఫార్సు చేయాల్సి వచ్చింది. కానీ, తొమ్మిది నెలలవుతున్నా ఇంతవరకూ ఎలాంటి చర్యలు లేవు.

ఎనిమిదేళ్లలో కేసుల తీరు..

రేంజ్ పేరు	నమోదైన కేసులు	సీజ్ చేసిన ట్రాక్టర్లు
వర్ని	185	55
నిజామాబాద్ సౌత్	43	15
కమ్మర్‌పల్లి	165	15
సిరికొండ	146	17
ఇందల్వాయి	135	10



అధికారులు పెట్టిన బ్యానర్

వర్ని మండలం జలాల్‌పూర్ అటవీ ప్రాంతంలో సిద్ధాపూర్ గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎఫ్ఆర్వో గంగాధర్ (ఫైల్)



పోడు సమస్య పోయేదెన్నడు?

కేసులు నమోదు చేస్తున్నా ఆగని అటవీ ఆక్రమణలు

- జిల్లాలో ఫారెస్టు అధికారులపై కొనసాగుతున్న దాడులు
- తలనొప్పిగా మారిన పోడు భూముల వ్యవహారం

డొంకేశ్వర్(ఆర్మూర్): ఒకవైపు అడవుల్లో కలప కోసం చెట్ల నరికివేత, మరో వైపు పోడు భూముల ఆక్రమణ.. ఈ రెండు విషయాలు అటవీ శాఖ ఉద్యోగులకు నిద్ర లేకుండా చేస్తున్నాయి. ప్రధానంగా వర్షాకాలం వచ్చిందంటే చాలు పోడు భూముల వ్యవహారం పెద్ద తలనొప్పిగా మారుతోంది. అటవీ భూములను రక్షించడానికి వెళ్లిన అధికారులపై దాడులకు తెగబడుతున్నారు. కళ్లల్లో కారం చల్లి చంపేంత పనిచేస్తున్నారు. దీంతో అటవీ ఉద్యోగులు ప్రాణభయంతో విధులు నిర్వర్తిస్తున్నారు. జిల్లాలో నిజామాబాద్ సౌత్, ఇందల్వాయి. సిరికొండ, కమ్మర్‌పల్లి రేంజ్‌ల పరిధిలో అటవీ భూముల ఆక్రమణలు ఎక్కువగా జరుగుతున్నాయి. రెండేళ్ల క్రితం బీఆర్ఎస్ ప్రభుత్వం జిల్లాలో 4,229 మందికి పోడు పట్టాలను పంపిణీ చేసి అటవీ భూములను దున్నుకునేందుకు అవకాశం కల్పించింది. పోడు కొడితే మాకు కూడా పట్టాలు వస్తాయనే ఆశతో ఇప్పుడు మరికొందరు భూములను దున్నుతున్నారు. అయితే అటవీ భూములను రక్షించే విషయంలో ఇప్పుడున్న కాంగ్రెస్ ప్రభుత్వం కఠినంగానే వ్యవహరిస్తోంది. అడవులను ఆక్రమిస్తే అధికారులను బాధ్యులను చేసి వారిపై చర్యలు తీసుకుంటోంది. దీంతో అటవీ స్థలాలను కాపాడడం ఆ శాఖ ఉద్యోగులకు పెద్ద సవాల్‌గా మారింది. వ్యక్తులపై ఎన్ని కేసులు నమోదు చేసినా, ట్రాక్టర్లు సీజ్ చేసినా అడవుల్లో మళ్లీ పోడు కొడుతూనే ఉన్నారు. అటవీ చట్టాలు, శిక్షలు కఠినంగా లేకపోవడంతోపాటు తమకు ఆయుధాలు లేకపోవడంతో పోడు భూములను ఆక్రమిస్తున్నారని ఫారెస్టు ఉద్యోగులు పేర్కొంటున్నారు. పోడు కొట్టిన వ్యక్తులను కోర్టుకు తీసుకెళ్తే బెయిలబుల్ కేసు కావడంతో ఏడేళ్లలోపే శిక్ష వేయడానికి అవకాశముంది. శిక్షను అనుభవించకుండా ఉండేందుకు తిరిగి అటవీ అధికారుల నుంచి బెయిల్ తీసుకొని తిరుగుతున్నారు. అదే నాన్‌బెయిల్ కేసు ఉంటే ఈ పరిస్థితి ఉండేది కాదని, చట్టాన్ని కఠినంగా చేయాలని అటవీ ఉద్యోగులు కోరుతున్నారు. లేదంటే పోడు సమస్య పోయే దాకా తమ పరిస్థితి ఇంతే ఉంటుందని, అటవీ ఆక్రమణలు నిలువరించడం కష్టసాధ్యమని చెప్తున్నారు.

రైతు సమ్మేళన సభాస్థలి పరిశీలన

- భద్రత ఏర్పాట్లపై ఉన్నతాధికారులతో ఎంపీ అర్వింద్ సమీక్ష
- 29న జిల్లాలో పర్యటించనున్న కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా



వివరాలు తెలుసుకుంటున్న ఎంపీ, ఎమ్మెల్యే

సుభాష్‌నగర్: నగరంలోని పాలిటెక్నిక్ మైదానంలో ఈ నెల 29వ తేదీన నిర్వహించే రైతు సమ్మేళనం బహిరంగ సభాస్థలిని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డితో కలిసి ఎంపీ అర్వింద్ ధర్మపురి బుధవారం సాయంత్రం పరిశీలించారు. సభకు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా హాజరు కానున్న నేపథ్యంలో కేంద్ర బలగాలు, పోలీస్ అధికారులతో ఆయన భద్రతా ఏర్పాట్లపై సమీక్షించారు. 29న జాతీయ పసుపుబోర్డు కార్యాలయం ప్రారంభం, కంఠేశ్వర్ బైపాస్ చౌరస్తాలో డీఎస్ విగ్రహావిష్కరణ, పాలిటెక్నిక్ మైదానంలో రైతు సమ్మేళనం కార్యక్రమంలో అమిత్ షా పాల్గొంటారని ఎంపీ అర్వింద్ వెల్లడించిన విషయం తెలిసిందే. ఈ మేరకు పాలిటెక్నిక్ మైదానాన్ని ఎంపీ అర్వింద్ పరిశీలించారు. ఈ సందర్భంగా హెలీప్యాడ్ ఏర్పాటు, ట్రాఫిక్ మళ్లింపు, వేదిక తదితర ఏర్పాట్లపై కేంద్ర బలగాలు, పోలీస్ ఉన్నతాధికారులను అడిగి తెలుసుకున్నారు. అమిత్ షా మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో జిల్లాకు చేరుకునే అవకాశముందని ఎంపీ తెలిపారు. ఆయన వెంట బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేశ్ పటేల్ కులాచారి, ఏసీపీ రాజావెంకట్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

నేడు నిజామాబాద్‌కు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి!

29న జిల్లాలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా పర్యటన నేపథ్యంలో భద్రత, బహిరంగ సభ ఏర్పాట్లపై సమీక్షించేందుకు గురువారం కేంద్ర మంత్రి జీ కిషన్‌రెడ్డి జిల్లాకు వస్తున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. జాతీయ పసుపు బోర్డు కార్యాలయం, బహిరంగ సభ నిర్వహించే పాలిటెక్నిక్ కళాశాల మైదానాన్ని కిషన్‌రెడ్డి పరిశీలించనున్నారు.

బుజ్జమ్మా.. ఆరోగ్యం ఎట్లుంది



జీజీహెచ్‌లోని షెడ్డు కింద ఉన్న బుజ్జమ్మ ఆరోగ్య పరిస్థితి తెలుసుకుంటున్న వీ ప్రభాకర్



ఆర్మూర్ ప్రభుత్వ ఆస్పత్రిలో బుజ్జమ్మ కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి

- వృద్ధురాలిని పరామర్శించిన కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి
- మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు ఆదేశం

ఆర్మూర్ : 'బుజ్జమ్మా ఆరోగ్యం ఎలా ఉంది? డాక్టర్లు, సిబ్బంది సరిగ్గా పట్టించుకుంటున్నారా? అవసరమైతే హైదరాబాద్‌కు పంపిస్తా?' అని ఆర్మూర్ ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వృద్ధురాలిని కలెక్టర్ టీ వినయ్‌కృష్ణారెడ్డి పరామర్శించారు. ఆమె ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. వివరాల్లోకి వెళితే.. పెర్కిట్‌కు చెందిన బుజ్జమ్మ అనారోగ్యంతో బాధపడుతుండడంతో అంబులెన్స్ సిబ్బంది మంగళవారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో చేర్పించారు. ఆస్పత్రి సిబ్బంది గాయమైన కాలికి పట్టీ కట్టి బయటకు పంపించారు. దీంతో బుజ్జమ్మ ఆస్పత్రి బయట రేకుల షెడ్డులో దయనీయ పరిస్థితుల్లో పడుకొని ఉంది. ఆస్పత్రి వర్గాలు సరిగా పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించి బయటకు పంపించారని గమనించిన సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా నాయకుడు ప్రభాకర్ ఫోన్ ద్వారా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన కలెక్టర్ బుజ్జమ్మకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని జీజీహెచ్ అధికారులను ఆదేశించారు. అయితే, తమ స్వస్థలమైన పెర్కిట్‌కు చేరువలో ఉన్న ఆర్మూర్ ఆస్పత్రిలో చికిత్స చేయించాలని బుజ్జమ్మ దూరపు బంధువులు కోరడంతో ఆమెను ఆర్మూర్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. కలెక్టర్ బుధవారం ఆర్మూర్ ప్రభుత్వ ఆస్పత్రిని సందర్శించి బుజ్జమ్మను పరామర్శించారు. ఆమె కాలికి గాయం తీవ్రంగా ఉందని, మెరుగైన వైద్య సేవలు అవసరమని డీసీహెచ్ఎస్ డాక్టర్ శ్రీనివాస్ ప్రసాద్ కలెక్టర్ దృష్టికి తెచ్చారు. దీంతో బుజ్జమ్మను తిరిగి జీజీహెచ్‌కు షిఫ్ట్ చేయాలని, పూర్తిగా కోలుకునే వరకు మెరుగైన చికిత్స అందించాలని, అవసరమైతే హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించాలని కలెక్టర్ ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు బుజ్జమ్మను వెంటనే జీజీహెచ్‌కు తరలించారు.



పాతికేళ్ల తర్వాత మోగిన గంట

- గాంధీగంజ్‌లో క్లాక్‌టవర్‌కు కొత్త గడియారం

సుభాష్‌నగర్: జిల్లా కేంద్రంలోని గాంధీగంజ్‌లో పురాతన గడియారానికి పునర్జీవం వచ్చింది. దాదాపు 25 ఏళ్ల తర్వాత గంజ్‌లో బుధవారం మళ్లీ గంట మోగింది. 1905లో సిర్నాపల్లి సంస్థానాధీశురాలు శీలం జానకీబాయి గంజ్‌లో గడియారాన్ని ఏర్పాటు చేశారు. ఆ గడియారం రైతులు, స్థానిక వ్యాపారులు, ప్రజలకు వందేళ్లపాటు సమయాన్ని తెలిపింది. అడపాదడపా మరమ్మతులు చేస్తూ కొన్నిరోజులు నెట్టుకొచ్చినా.. సరైన నిర్వహణ లేక మధ్యలో ఆగిపోయింది. నిజామాబాద్ ఏఎంసీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని రూ.4.35 లక్షలు కేటాయించారు. దీంతో ఒడిశాలోని భువనేశ్వర్‌కు చెందిన తాజ్ కంపెనీలో తయారైన బ్యాటరీ గడియారాన్ని బిగించారు. ఈ గడియారం సమయం తెలియజేయడంతోపాటు ప్రాత:కాలం, సుప్రభాతం, పరిసరాల శుభ్రత, గంజ్ నియమాల అనౌన్స్‌మెంట్ చేస్తుంది. తిరుపతిలో గడియారం ఏర్పాటు చేసిన కంపెనీయే దీనిని తయారు చేయడం విశేషం.

జూలై 16న తెయూ రెండో కాన్వొకేషన్

- ముఖ్య అతిథిగా హాజరుకానున్న ఐఐసీటీ మాజీ డైరెక్టర్ డాక్టర్ చంద్రశేఖర్
- వీసీ ప్రొఫెసర్ యాదగిరిరావు వెల్లడి



కాన్వొకేషన్ కమిటీల కన్వీనర్లతో మాట్లాడుతున్న తెయూ వీసీ ప్రొఫెసర్ యాదగిరిరావు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ విశ్వవిద్యాలయంలో రెండో కాన్వొకేషన్‌ను జూలై 16న ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్నామని వైస్‌–చాన్స్‌లర్ ప్రొఫెసర్ టీ యాదగిరిరావు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ (ఐఐసీటీ) మాజీ డైరెక్టర్ డాక్టర్ శ్రీవారి చంద్రశేఖర్ హాజరుకానున్నారు. వర్సిటీ కంట్రోలర్, డీన్స్, ప్రిన్సిపాల్స్, డైరెక్టర్స్, అధ్యాపకులతో బుధవారం వీసీ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కాన్వొకేషన్ విజయవంతం చేయడానికి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం యాదగిరి కన్వీనర్‌గా 13 కమిటీలను ఏర్పాటు చేశామన్నారు. కమిటీల కన్వీనర్లు క్రమశిక్షణతో కాన్వొకేషన్ పనులను పూర్తిచేసి విజయవంతం చేయాలని సూచించారు. వర్సిటీ ప్రారంభమైన తర్వాత 13 నవంబర్ 2013న మొదటి కాన్వొకేషన్ నిర్వహించారని, రెండో కాన్వొకేషన్ కోసం అప్పటి వీసీ ప్రొఫెసర్ పీ సాంబయ్య హయాంలో 6 జూలై 2018న, మళ్లీ గత వీసీ ప్రొఫెసర్ రవీందర్ గుప్తా హయాంలో 12 మార్చి 2020న నోటిఫికేషన్లు ఇచ్చినప్పటికీ పలు కారణాలతో వాయిదా పడినట్లు వీసీ తెలిపారు. ప్రస్తుతం వీసీగా తాను బాధ్యతలు చేపట్టిన తర్వాత 14 నవంబర్ 2024న కాన్వొకేషన్ నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ప్రొఫెసర్ యాదగిరిరావు తెలిపారు. పీజీ, యూజీలో వివిధ విభాగాల నుంచి మొదటి ర్యాంకు సాధించిన 130 మంది విద్యార్థులకు గోల్డ్ మెడల్స్‌తోపాటు సుమారు 70 మంది స్కాలర్స్‌కు పీహెచ్‌డీ డాక్టరేట్ పట్టాలను రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా అందించనున్నట్లు వీసీ తెలిపారు.

క్లుప్తంగా

సరదాతో పొంచి ఉన్న ప్రమాదం



బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ సందర్శనకు వస్తున్న పర్యాటకులు నీటి అంచున సరదా కోసం అనేక ప్రయత్నాలు చేస్తున్నారు. దీంతో ప్రాజెక్ట్‌లో మునిగి పోయే ప్రమాదం ఉందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో అనేక మంది యువకులు నీటిలో మునిగి మృత్యువాత పడ్డారు. కానీ పర్యాటకులు నీటి లోపలికి వెళ్లకుండా ప్రాజెక్ట్ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. ఇప్పటికైనా ప్రాజెక్ట్ అధికారులు స్పందించి వెంటనే పర్యాటకులు నీటి లోపలికి వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

సకాలంలో సిలబస్ పూర్తి చేయాలి



మాట్లాడుతున్న తెయూ వీసీ యాదగిరిరావు

తెయూ(డిచ్‌పల్లి): అకడమిక్ క్యాలెండర్ ప్రకారం సకాలంలో సిలబస్ పూర్తి చేసి 2025–26 విద్యాసంవత్సరాన్ని విజయవంతం చేయాలని తెయూ వీసీ యాదగిరిరావు సూచించారు. యూనివర్సిటీలో బుధవారం ఆయన రిజిస్ట్రార్ యాదగిరి, ప్రిన్సిపాల్ ప్రవీణ్‌లతో కలిసి వివిధ విభాగాల అధ్యాపకులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వీసీ మాట్లాడుతూ.. ఈ విద్యా సంవత్సరం ప్రతి విభాగం నుంచి వర్తమాన సాంకేతిక అంశాలపై సదస్సులు, సింపోజియం, వర్క్‌షాప్‌లు నిర్వహించాలన్నారు.పరీక్షలు వాయిదా వేయరాదని, సమయానికి ఇంటర్నల్ ఎగ్జామ్స్, ప్రాక్టికల్స్ కంప్లీట్ చేయాలని స్పష్టం చేశారు.

తక్షశిలకు డాక్టరేట్



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ హిందీ విభాగంలో పరిశోధకురాలు తక్షశిల పీహెచ్‌డీ డాక్టరేట్ సాధించారు. హిందీ విభాగాధ్యక్షురాలు పార్వతి మార్గనిర్దేశనంలో 'హిందీ దళిత మహిళా ఆత్మకథా వోమే యదార్థ వాద' అనే అంశంపై తక్షశిల పరిశోధన పూర్తి చేసి సిద్ధాంత గ్రంథం సమర్పించారు. తెయూ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజ్ మినీ సెమినార్ హాల్‌లో బుధవారం నిర్వహించిన ఓపెన్ వైవాకు ఇఫ్లూ హిందీ హెచ్‌వోడీ రేఖారాణి ఎక్స్‌టర్నల్ ఎగ్జామినర్‌గా వ్యవహరించారు. పరిశోధకురాలిని పలు ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. డాక్టరేట్ సాధించిన తక్షశిలను వీసీ యాదగిరిరావు, రిజిస్ట్రార్ యాదగిరి, అధ్యాపకులు అభినందించారు. ఆర్ట్స్ అండ్ సైన్స్ డీన్ లావణ్య, బీవోఎస్ చైర్మన్ మహ్మద్ జమీల్ అహ్మద్, హెచ్‌వోడీ పార్వతి, ప్రిన్సిపాల్ ప్రవీణ్, ప్రొఫెసర్ కనకయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

డైట్ ప్రవేశాలకు 27న సర్టిఫికెట్ల పరిశీలన

కామారెడ్డి అర్బన్: డైట్‌లో ప్రవేశాల కోసం సర్టిఫికెట్ వెరిఫికేషన్ పొందని అభ్యర్థులు ఈనెల 27న హాజరు కావాలని నిజామాబాద్ ప్రిన్సిపల్ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. రెండో విడత కౌన్సెలింగ్, వెబ్ ఆధారిత ప్రాధాన్యతలకు ఈనెల 28 నుంచి 30 వరకు పాల్గొనవచ్చన్నారు. తొలి విడత సీటు పొందని కొత్త అభ్యర్థులు సైతం వెబ్ ప్రాధాన్యతలు ఇవ్వడంతో పాటు ఎడిట్ ఆప్షన్ ఇవ్వడానికి జూలై 1 వరకు అవకాశం ఉందన్నారు. రెండో విడత అభ్యర్థులకు సీట్లు, కళాశాల కేటాయింపు జూలై 5న జరుగుందన్నారు.

తీవ్ర జాప్యం.. యువతలో నైరాశ్యం

- జాడ లేని రాజీవ్ యువ వికాసం రుణాల పంపిణీ
- షెడ్యూల్ ప్రకారం సాగని ప్రక్రియ

మోర్తాడ్‌కు చెందిన మహేష్ బ్యాంగిల్ స్టోర్ ఏర్పాటు చేయడానికి రాజీవ్ యువ వికాసం కింద రూ.4లక్షల రుణం కోసం దరఖాస్తు చేసుకున్నాడు. సిబిల్ స్కోర్ బాగుండటంతో బ్యాంకర్లు కూడా అతని దరఖాస్తును మొదటి ప్రాధాన్యత జాబితాలో ఉంచారు. ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రారంభించే ప్రక్రియను వాయిదా వేయడం, కనీసం అమలు చేసే షెడ్యూల్‌ను ప్రకటించకపోవడంతో మహేష్‌కు రుణం దక్కలేదు. సొంతంగా వ్యాపారం ఆరంభించాలని దరఖాస్తుదారుడు భావించినా పెట్టుబడి పెట్టే స్థోమత లేకపోవడంతో తన కలలను సాకారం చేసుకోవడం కోసం ప్రభుత్వ పథకానికి దరఖాస్తు చేసుకున్నాడు. రుణ పంపిణీలో తీవ్ర జాప్యం కారణంగా అతడు ఆందోళన చెందుతున్నాడు. ఇలా జిల్లాలోని నిరుద్యోగ యువత ప్రభుత్వం అందించే రాయితీ రుణాల కోసం ఎదురుచూస్తున్నారు.

మోర్తాడ్(బాల్కొండ): రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం పథకాన్ని ప్రారంభించింది. ఇందులో భాగంగా యువత నుంచి రుణాల కోసం దరఖాస్తులను ఆహ్వానించింది. జిల్లాలో వేలాదిగా యువత దరఖాస్తులను చేసుకుంది. కానీ నెలలు గడుస్తున్నా రుణాల పంపిణీ ప్రక్రియ ముందుగు సాగడం లేదు. దీంతో దరఖాస్తు చేసుకున్న నిరుద్యోగులు రుణాల కోసం వేయికళ్లతో ఎదురుచూస్తున్నారు. పంపిణీలో తీవ్ర జాప్యం నెలకొనడంతో యువత నైరాశ్యం చెందుతున్నారు.

జిల్లాలో 58వేల మంది..

రాష్ట్ర అవిర్భావ దినోత్సవం సందర్భంగా రుణాల పంపిణీని ఆరంభిస్తామని ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం పథకం కింద దరఖాస్తులను స్వీకరించే సమయంలోనే ప్రకటించింది. కానీ ఇప్పటి వరకూ ఎప్పుడు ఆరంభిస్తారో షెడ్యూల్‌ను వెల్లడించలేదు. ఫలితంగా జిల్లా వ్యాప్తంగా దరఖాస్తు చేసుకున్న 58వేల మందికి పైగా ఆశావహులు నిరీక్షిస్తున్నారు. రూ.50వేల వరకు రుణం కోసం దరఖాస్తు చేసుకునేవారికి వంద శాతం రాయితీని వర్తించేలా ప్రభుత్వం మార్గదర్శకాలను ఖరారు చేసింది. రూ.1లక్ష రుణానికి 90 శాతం రాయితీని, రూ.1లక్ష నుంచి రూ.2లక్షల వరకూ రుణాలకు 80 శాతం రాయితీని, రూ.2లక్షల నుంచి రూ.4లక్షల వరకు రుణాలకు 70 శాతం రాయితీని అందిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. అనేక మంది రూ.4లక్షల వరకు రుణం కావాలని దరఖాస్తు చేసుకున్నారు. కానీ ప్రభుత్వం ఇప్పటి వరకూ ఏ ఒక్కరికి కూడా రుణాలను పంపిణీ చేయలేదు. వాయిదా వేసినప్పటికీ మరో షెడ్యూల్‌ను ఖరారు చేయకపోవడంతో నిరుద్యోగులకు నిరీక్షణ తప్పడం లేదు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలోను రాయితీ రుణాలకు తీవ్ర అన్యాయం జరిగిందని ఇప్పటి ప్రభుత్వ హయాంలోను ఇదే పరిస్థితి కొనసాగితే ఎలా అని పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రాయితీ రుణాల కార్యక్రమాన్ని వెంటనే ప్రారంభించాలని నిరుద్యోగులు కోరుతున్నారు.



యువతకు దారి చూపాలి..



నిరుద్యోగులైన యువతీ యువకులు ఎంతో ఆశతో రాజీవ్ యువ వికాసం కోసం దరఖాస్తు చేసుకున్నారు. వారి కి సకాలంలో రాయితీ రుణా లు ఇవ్వకపోతే ఇబ్బంది ఎదురవుతుంది. స్వయం ఉపాధి పొందాలనుకునే వారికి రాయితీ రుణాలు ఇచ్చి అండగా ఉండాలి.

– తోకల నర్సయ్య, మాజీ సర్పంచ్, తాళ్లరాంపూర్

ప్రభుత్వం స్పందించాలి..



రాజీవ్ యువ వికాసం పేరిట రుణాలు ఇచ్చి ఆదుకుంటామని దరఖాస్తులు తీసుకుని ఇప్పటి వరకూ ఏ ఒక్కరికి కూడా నయాపైసా రుణం ఇవ్వలేదు. యువతను నమ్మించి మోసం చేస్తున్నారు. ఇది సరైన విధానం కాదు. ప్రభుత్వం స్పందించి వెంటనే రాయితీ రుణాలకు నిధులు విడుదల చేయాలి.

– తక్కూరి సాగర్, దరఖాస్తుదారుడు, మోర్తాడ్

కష్టపడ్డ వారికి కచ్చితంగా గుర్తింపు

- డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి
- టీపీసీసీ పదవులు పొందిన రాం భూపాల్, రామకృష్ణలకు సన్మానం



రాం భూపాల్, రామకృష్ణను సన్మానిస్తున్న నాయకులు

నిజామాబాద్ సిటీ: కాంగ్రెస్ పార్టీకోసం కష్టపడ్డవారిని, కష్టకాలంలో పార్టీని కాపాడుకున్నవారికి కచ్చితంగా గుర్తింపు లభిస్తుందని డీసీసీ అధ్యక్షుడు, రాష్ట్ర సహకార సంఘం చైర్మన్ మానాల మోహన్ రెడ్డి, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు నుడా చైర్మన్ కేశ వేణు అన్నారు. జిల్లాకు చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు రాంభూపాల్‌కు టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, జీవీ రామకృష్ణకు క్రమశిక్షణాసంఘం సభ్యుడిగా బాధ్యతలు అప్పగించడం అభినందనీయమన్నారు. ఈసందర్భంగా జిల్లాకేంద్రంలోని కాంగ్రెస్ భవన్‌లో బుధవారం వారిద్దరినీ పార్టీ తరపున సన్మానించారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రాం భూపాల్, క్రమశిక్షణా సంఘం సభ్యుడు జీవీ రామకృష్ణను గజమాలతో సత్కరించి, అభినందించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. జిల్లాకు చెందిన నాయకులకు టీపీసీసీలో చోటు దక్కడం, సముచితంగా ఉందన్నారు. తమపై నమ్మకంతో టీపీసీసీలో ఉన్నత పదవులు ఇచ్చిన సీఎం రేవంత్‌రెడ్డికి, పీసీసీ చీఫ్ బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్‌కు, ఏఐసీసీ పెద్దలకు రాంభూపాల్, జీవీ రామకృష్ణ కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా గ్రంథాలయ చైర్మన్ రాజారెడ్డి, ఏఎంసీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, నాయకులు రత్నాకర్, విపుల్ గౌడ్, లింగం, సంతోష్, నవాజ్, ప్రీతం, రాజేంద్ర ప్రసాద్, నరేందర్‌సింగ్ పాల్గొన్నారు.

కాసర్లకు బెస్ట్ టీచర్ అవార్డు



మోపాల్: హైదరాబాద్‌లోని ఏఎస్‌రావు నగర్‌లో బుధవారం వరల్డ్ క్లారిటీ అవార్డు ప్రదానోత్సవం జరిగింది. ఈకార్యక్రమంలో మోపాల్ మండలం సిర్పూర్ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు కాసర్ల నరేష్‌రావు నేషనల్ బెస్ట్ టీచర్ అవార్డును అందుకున్నారు. విద్యావేత్తలు నాగేశ్వర్‌రావు, మీనుశ్రీ, మిస్ తెలంగాణ జెనియా, చారిటీ సంస్థ నిర్వాహకులు, వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన సుమారు 200 మంది సభ్యులు పాల్గొన్నారు. కాసర్లకు డీఈవో అశోక్ తదితరులు అభినందనలు తెలియజేశారు.

నేరాలు, ప్రమాదాల నివారణకు 'ప్లాన్ ఆఫ్ యాక్షన్'

- ప్రతి ఎస్‌హెచ్‌వో ప్రణాళిక ఏర్పాటు చేసుకోవాలి
- సీపీ సాయి చైతన్య



మాట్లాడుతున్న సీపీ సాయిచైతన్య

ఖలీల్‌వాడి: రోడ్డు ప్రమాదాల నివారణ, నేరాల నియంత్రణ కోసం పోలీస్ స్టేషన్ పరిధిలో సిబ్బందికి ప్రణాళిక ప్రకారంగా 'ప్లాన్ ఆఫ్ యాక్షన్' నిర్వహించాలని సీపీ పోతరాజు సాయిచైతన్య ఎస్సైలకు సూచించారు. జిల్లా కేంద్రంలోని సీపీ కార్యాలయంలో బుధవారం బోధన్ డివిజన్‌లోని పోలీసు అధికారులకు నేరాల నియంత్రణపై నెలవారి సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా సీపీ మాట్లాడుతూ.. లాంగ్ పెండింగ్ కేసులను వెంటనే పరిష్కరించాలని సూచించారు. ప్రజలకు సైబర్ క్రైమ్స్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. వచ్చే ఆరు నెలల్లో ప్రతి ఎస్‌హెచ్‌వో లక్ష్యాలు పెట్టుకొని నేరాల నియంత్రణ కోసం ఒక ప్రణాళికను ఏర్పాటు చేసుకోవాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణ కోసం బ్లాక్ స్పాట్లను గుర్తించి, అక్కడ ప్రమాదాలు జరగకుండా కావాల్సిన ఏర్పాట్లు చేయాలన్నారు. మట్కా, గ్యాంబ్లింగ్, గంజాయి మొదలగు చట్టవ్యతిరేక కార్యాకలాపాలపై ప్రత్యేకమైన 'నిఘా' ఏర్పాటు, లాడ్జీలలో ఎప్పటికప్పుడు ముమ్మరంగా తనిఖీలు చేయాలన్నారు. నిజామాబాద్ అదనపు పోలీస్ కమిషనర్ (అడ్మిన్) బస్వారెడ్డి , ఏసీపీలు, సీఐలు, ఎస్సైలు స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ శ్రీశైలం పాల్గొన్నారు.

అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): జిల్లాలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల/కళాశాలల్లో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులను పార్ట్‌టైం ప్రాతిపదికన భర్తీ చేయడానికి అర్హులైన మహిళల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ జిల్లా కోఆర్డినేటర్ మాధవీలత ఒక ప్రకటనలో తెలిపారు. జేఎల్–ఫిజిక్స్, బోటనీ, జువాలజీ, పీజీటీ– ఫిజికల్ సైన్స్, బయో సైన్స్, సోషల్ స్టడీస్, టీజీటీ–బయో సైన్స్ ఖాళీలు ఉన్నాయన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు సంబంధిత సబ్జెక్టులో పోస్ట్ గ్రాడ్యుయేట్ (పీజీ)తో పాటు బీఈడీ విద్యార్హత కలిగి ఉండి, కనీసం ద్వితీయ శ్రేణిలో ఉత్తీర్ణులై ఉండాలని ఆమె తెలిపారు. అర్హత, ఆసక్తి గల మహిళా అభ్యర్థులు ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాలతో ఈ నెల 28న డిచ్‌పల్లి మండలం ధర్మారం(బి) గ్రామంలో గల సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల/కళాశాలలో హాజరు కావాలన్నారు. డెమో, అనుభవం ప్రాతిపదికన అభ్యర్థుల ఎంపిక జరుగుతుందని జిల్లా కోఆర్డినేటర్ తెలిపారు.

క్రైం కార్నర్

కరెంట్ షాక్‌తో స్తంభంపైనే ఒకరి మృతి



స్తంభంపై పోశెట్టి మృతదేహం (ఇన్‌సెట్‌లో) పోశెట్టి (ఫైల్)

బోధన్: విద్యుత్ స్తంభం ఎక్కి కరెంట్ తీగుల లాగుతుండగా ఓ వ్యక్తి కరెంట్ షాక్‌తో అక్కడికక్కడే మృతిచెందాడు. నవీపేట ఎస్సై వినయ్ కుమార్, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా.. నవీపేట మండలం లింగాపూర్ గ్రామ శివారులోని పంట పొలాల్లో గ్రామానికి చెందిన దినసరి కూలి రెంజర్ల పోశెట్టి (44) బుధవారం ఇదే గ్రామానికి చెందిన రైతు క్లాం శివ పొలంలో కరెంట్ బోరుబావి వద్ద పనికి వెళ్లాడు. బోరుబావికి సంబంధించిన సర్వీస్ వైర్‌ను 11కేవీ లైన్ తీగలున్న స్తంభంపైకి ఎక్కి లాగుతుండగా ప్రమాదవశాత్తు షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పాముకాటుతో మహిళ..

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని వజ్జపల్లి గ్రామంలో పాముకాటుతో ఓ మహిళ మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామంలోని చర్ల చిన్నమ్మ (52) అనే మహిళ బుధవారం వ్యవసాయ భూమి వద్ద పనులు చేస్తుండగా పాము కాటు వేసింది. ఇది గమనించిన బంధువులు వెంటనే ఆమెను చికిత్స నిమిత్తం కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. కానీ మార్గమధ్యలోనే ఆమె మృతిచెందినట్లు గ్రామస్తులు తెలిపారు. మృతురాలికి భర్త భూమయ్య, నలుగురు కుమార్తెలు ఉన్నారు

గుర్తుతెలియని వాహనం ఢీకొని ఒకరు..





మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు.. సాయిలు (ఫైల్)

రుద్రూర్: మండలంలోని అంబం(ఆర్) శివారులో బుధవారం మండల కేంద్రానికి చెందిన వ్యవసాయ కూలి కడారి చిన్న సాయిలు (37) మృతదేహం లభ్యమయింది. పొలాలకు వెళ్తున్న రైతులు మృతదేహాన్ని గుర్తించి రుద్రూర్ పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించారు. ఎస్ఐ సాయన్న ఆధ్వర్యంలో పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి వద్ద లభించిన ఆధార్ కార్డు ఆధారంగా రుద్రూర్‌కు చెందిన కడారి చిన్న సాయిలుగా గుర్తించారు. మంగళవారం రాత్రి గుర్తుతెలియని వాహనం ఢీకొనడం వల్ల అతడు మృతిచెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. మృతుడి భార్య బాలామణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

ఒకరిపై కేసు నమోదు

మోపాల్: మండలంలోని ముదక్‌పల్లి గ్రామానికి చెందిన రవిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ యాదగిరి గౌడ్ బుధవారం తెలిపారు. వివరాలు ఇలా.. గ్రామంలోని కల్లుబట్టీలో రాజారెడ్డి, రవి ఇటీవల ఇరువురు కల్లు సేవించారు. ఆ సమయంలో రవి రాజారెడ్డిని సెల్‌ఫోన్‌లో వీడియో తీశాడు. దీన్ని గమనించిన రాజారెడ్డి ఎందుకు వీడియో తీస్తున్నావని ప్రశ్నించాడు. ఈక్రమంలో ఇరువురి మధ్య వాగ్వాదం జరగగా, రాజారెడ్డిపై రవి దాడి చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు రవిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ యాదగిరి గౌడ్ తెలిపారు.

మాదక ద్రవ్యాల నియంత్రణే లక్ష్యం

- విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలి
- కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి, సీపీ సాయి చైతన్య
- కలెక్టరేట్‌లో అధికారులతో జిల్లాస్థాయి సమావేశం



మాట్లాడుతున్న కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి, పాల్గొన్న సీపీ సాయి చైతన్య, అదనపు కలెక్టర్ అంకిత్

నిజామాబాద్‌అర్బన్: మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాల నియంత్రణే లక్ష్యమని, ఇందుకోసం విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి, సీపీ సాయి చైతన్య అన్నారు. నగరంలోని కలెక్టరేట్‌లో బుధవారం మత్తు పదార్థాల నిరోధక కమిటీ జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్, సీపీ సంబంధిత శాఖల జిల్లా అధికారులకు పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు. మాదక ద్రవ్యాల వల్ల కలిగే దుష్పరిణామాల గురించి ప్రజలలో అవగాహన పెంపొందించేందుకు సామాజిక మాధ్యమాలతో పాటు అందుబాటులో ఉన్న అన్ని అవకాశాలను వినియోగించుకోవాలని సూచించారు. కల్తీ కల్లు తయారీ కోసం వినియోగించే క్లోరోఫాం, డైజోఫాం, అల్ప్రాజోలం వంటి వాటిని కట్టడి చేయడానికి గట్టి నిఘా ఉంచాలన్నారు.

కొంతమంది గర్భిణులు కల్తీ కల్లు సేవిస్తున్నట్లు తెలుస్తోందని, ఇది పుట్టబోయే బిడ్డతోపాటు మహిళ ఆరోగ్యంపై కూడా తీవ్ర దుష్ప్రభావం చూపుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిని దృష్టిలో పెట్టుకొని గ్రామగ్రామాన అవగాహన కల్పించాలని సూచించారు. పాఠశాలలు, కళాశాలల్లో మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాల నిరోధక కమిటీలను బలోపేతం చేస్తూ పూర్తిస్థాయిలో అవి పని చేసేలా చూడాలని విద్యాశాఖ అధికారులకు సూచించారు. ఎక్కడైనా గంజాయి, క్లోరల్ హైడ్రేట్, డైజోఫామ్, అల్ప్రాజోలం వంటి వాటి రవాణా, విక్రయాలు జరుగుతున్నట్లు గమనిస్తే వెంటనే సంబంధిత శాఖల అధికారులకు సమాచారం అందించాలని, టోల్ ఫ్రీ నెంబర్ 1908కు ఫోన్ చేసి సమాచారం తెలియజేయవచ్చన్నారు. అదనపు కలెక్టర్ అంకిత్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ లక్ష్మారెడ్డి, డీఈవో అశోక్, డీఏవో వీరాస్వామి, డీఎఫ్‌వో సుధాకర్, డీటీవో ఉమా మహేశ్వరరావు, జిల్లా ఔషధ నియంత్రణ అధికారిణి శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు చేరాలి



మాట్లాడుతున్న కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి

మోర్తాడ్: రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి లబ్ధిదారుడికి చేరే విధంగా ఉద్యోగులు కృషి చేయాలని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి సూచించారు. పథకాల అమలుకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. భీమ్‌గల్ మున్సిపాలిటీలో బుధవారం ఆయన పర్యటించారు. పట్టణంలో అమలవుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, వన మహోత్సవం, సీజనల్ వ్యాధుల నివారణ కోసం చేపడుతున్న చర్యలపై మున్సిపల్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. వార్డుల వారీగా సమీక్షించి ప్రణాళికబద్ధంగా కార్యక్రమాలను అమలు చేయాలని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లో వేగం పెంచాలని ఆదేశించారు. వన మహోత్సవం కింద మొక్కలను నాటించడమే కాకుండా వాటిని సంరక్షించడానికి జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రతి శుక్రవారం డ్రైడే నిర్వహించి పరిసరాలను శుభ్రంగా ఉంచేలా చూడాలన్నారు. అనంతరం బోయగల్లి, బాపూజీనగర్‌లలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పనులను ఆయన పరిశీలించారు. తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి, భూభారతి రెవెన్యూ సదస్సులో వచ్చిన దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను పరిశీలించారు. ఆగస్టు 14వరకు భూమి సమస్యలపై వచ్చిన దరఖాస్తులకు పరిష్కారం చూపాలని సూచించారు. జిల్లా మలేరియా నియంత్రణ విభాగం అధికారి డాక్టర్ తుకారాం రాథోడ్, మున్సిపల్ కమిషనర్ గోపు గంగాధర్, తహసీల్దార్ షబ్బీర్, ఎంపీడీవో సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'ఎమర్జెన్సీ డే' ప్రజాస్వామ్య చరిత్రలో చీకటి దినం



ఎమర్జెన్సీ సమయంలో జైలుకెళ్లిన పోరాటయోధులను సన్మానిస్తున్న దినేష్ పటేల్ కులాచారి

సుభాష్‌నగర్: భారతదేశ ప్రజాస్వామ్య చరిత్రలో ఎమర్జెన్సీ డే చీకటి దినమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ పటేల్ కులాచారి అన్నారు. నగరంలోని బీజేపీ కార్యాలయంలో బుధవారం ఎమర్జెన్సీ డేకు వ్యతిరేకంగా పోరాడి జైలుకెళ్లిన వుల్సే రాజేశ్వర్, పుప్పాల రాజేందర్, భూసారి గోవర్దన్, చెలివేలి శ్రీధర్‌ను ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా దినేష్ మాట్లాడుతూ.. 1971 సార్వత్రిక ఎన్నికల్లో ఇందిరాగాంధీ అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని ఆమెపై పోటీ చేసి ఓడిపోయిన రాజ్ నారాయణ్ అలహాబాద్ హైకోర్టులో కేసువేశారు. 4ఏళ్ల విచారణ తర్వాత 1975 జూన్ 12న ఇందిరా ఎన్నిక చెల్లదని, 6ఏళ్ల పాటు ఎన్నికల్లో పోటీ చేయొద్దని కోర్టు తీర్పునిచ్చింది. ఆ సమయంలో ప్రతిపక్ష పార్టీలు ఇందిరాగాంధీ రాజీనామా చేయాలని డిమాండ్ చేయగా, 1975 జూన్ 25న అర్ధరాత్రి ఎమర్జెన్సీ ప్రకటించిందన్నారు. దాదాపు రెండేళ్లు దేశాన్ని గుప్పిట్లో పెట్టుకుని ప్రజల స్వేచ్ఛను పూర్తిగా హరించారని విమర్శించారు. అధికారం కోసం ప్రధానమంత్రే నియంతగా మారిన ఒకే ఒక ప్రధాని ఇందిరాగాంధీ అని ఆరోపించారు. నాయకులు పోతన్‌కర్ లక్ష్మీనారాయణ, నాగోళ్ల లక్ష్మీనారాయణ, శివప్రసాద్, పంచరెడ్డి ప్రవళిక, ఇప్పకాయల కిషోర్, కోడూరు నాగరాజు, తారక్ వేణు, పద్మారెడ్డి, సందీప్, మాస్టర్ శంకర్, జగన్‌రెడ్డి, పడాల భూపతి, చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.

'అతిసార' నియంత్రణకు చర్యలు చేపట్టాలి



అతిసార వ్యాధి నియంత్రణపై వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అడిషనల్ కలెక్టర్ అంకిత్, అధికారులు

- అడిషనల్ కలెక్టర్ అంకిత్
- నీటి ట్యాంకులను క్లోరినేషన్ చేయించాలి

నిజామాబాద్‌నాగారం: జిల్లాలో అతిసార వ్యాధి నియంత్రణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని అడిషనల్ కలెక్టర్ అంకిత్ సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో అతిసార వ్యాధి నియంత్రణపై జిల్లా స్థాయి టాస్క్ ఫోర్స్ కమిటీ సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో చేతుల శుభ్రత, ఓఆర్ఎస్ ద్రావణం తయారీ విధానంపై అంగన్‌వాడీ కార్యకర్తలకు వివరించాలన్నారు. ప్రతి గ్రామంలోని నీటి ట్యాంకులను క్లోరినేషన్ చేయించాలని సూచించారు. శుద్ధి చేసిన నీటినే తాగాలని ప్రజలకు ఆయా శాఖల ఆధ్వర్యంలో అవగాహన కల్పించాలని టాస్క్‌ఫోర్స్ కమిటీ మెంబర్లకు సూచించారు. ఓఆర్ఎస్, జింక్ మాత్రలు ప్రతి అంగన్‌వాడి, పాఠశాలల్లో అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. పట్టణ ప్రాంతాల్లోని మురికివాడల్లో ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. అనంతరం అతిసార వ్యాధిపై అవగాహన కోసం రూపొందించిన పోస్టర్లను అడిషనల్ కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ స్టాప్ డయేరియా క్యాంపెయిన్ జూలై 31 వ తేదీ వరకు కొనసాగుతుందన్నారు. ఐదు సంవత్సరాలలోపు పిల్లల్లో అతిసార వ్యాధితో కలిగే మరణాలను తగ్గించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం ఉందన్నారు. జిల్లాలో అతిసార వ్యాధితో ఏ ఒక్కరూ మరణించకుండా చర్యలు తీసుకుంటామని ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ అశోక్ తెలిపారు. డీఆర్డీవో సాయాగౌడ్, డీడబ్ల్యూవో రసూల్‌బీ, ఆర్‌డబ్ల్యూఎస్ డిప్యూటీ ఈఈ ధర్మేందర్, మున్సిపల్ కమిషనర్ ఆర్మూర్ రాజు, పీవోలు రాజు, సుప్రియ, సానిటరీ ఇన్‌స్పెక్టర్ షాదుల్లా, సీడీపీవో సౌందర్య, డీపీహెచ్‌ఎన్‌వో స్వామి సులోచన, డీహెచ్‌ఈ ఘన్‌పూర్ వెంకటేశ్వర్లు, రాజాబాబు, సచిన్, తరుణ్, వినోద్, వైద్య సిబ్బంది ఉన్నారు.

గుమ్మిర్యాల్‌లో చైన్ స్నాచింగ్

మోర్తాడ్(బాల్కొండ): ఏర్గట్ల మండలం గుమ్మిర్యాల్‌లో నేరేళ్ల సాయమ్మ అనే మహిళ మెడ నుంచి బంగారు గొలుసును ఇద్దరు దుండగులు లాక్కొని వెళ్లిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. గుమ్మిర్యాల్‌లో తన ఇంటి నుంచి పక్క ఇంటికి వెళుతున్న సాయమ్మను ఇద్దరు వ్యక్తులు బైక్‌తో అడ్డగించి, ఆమె మెడలో ఉన్న రెండు తులాల బంగారు చైన్‌ను ఎత్తుకుని వెళ్లారు. ఈ ఘటన సీసీ కెమెరాలలో రికార్డు అయ్యింది. ఇలాంటి ఘటనే జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం గోదూర్‌లో ఇదేరోజు చోటుచేసుకోవడంతో రెండు ఘటనలకు పాల్పడింది వీరే కావచ్చని పోలీసులు సందేహిస్తున్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏర్గట్ల పోలీసులు తెలిపారు.

గుండారంలో ఒకరి ఆత్మహత్య

నిజామాబాద్‌రూరల్: రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గుండారం గ్రామంలో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. రూరల్ పోలీస్‌స్టేషన్ రెండో ఎస్సై ఆనంద్‌సాగర్ తెలిపిన వివరాలు ఇలా.. గుండారం గ్రామానికి చెందిన కొండెల సాయిరెడ్డి(55) భార్య కొన్నేళ్ల కిందట మృతిచెందింది. అతడికి ఇద్దరు కుమారులు ఉండగా తనను ఎవరూ పట్టించుకోవడం లేదంటూ జీవితంపై విరక్తి చెందాడు. ఈక్రమంలో ఈనెల 22 ఇంట్లో ఎవరూ లేని సమయంలో దూలానికి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఊరికి వెళ్లిన పెద్దకుమారుడు మంగళవారం ఇంటికి తిరిగి రాగా, తండ్రి మృతదేహాన్ని చూసి లబోదిబోమన్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.